అవిశ్వాసంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ

- ప్రయత్నాలు మొదలు పెట్టిన అధికార పార్టీ
- కాంగ్రెస్‌లోకి పలువురు అసంతృప్త బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు?

మిర్యాలగూడ : నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను తమ ఆధీనంలో తీసుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. మొన్నటి వరకు ప్రతిపక్షంలో ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ కావడంతో మున్సిపాలిటీ కైవసం చేసుకునేందుకు ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. అవిశ్వాసం పేరుతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తమ వారికే వచ్చేలా ఎత్తుగడలు వేస్తున్నారు. మెజార్టీ స్థానాలు గులాబీ పార్టీకి ఉన్నప్పటికీ వారిలో ఉన్న అసంతృప్తి కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోని అవిశ్వాసంలో నెగ్గాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ బీసీ నేత కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో త్వరలోనే మిర్యాలగూడ మున్సిపాలిటీ పాలకుల ముఖచిత్రం మారే అవకాశం కనిపిస్తుంది.

48 వార్డులతో మున్సిపాలిటీ

గ్రేడ్-1 మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన తరువాత మిర్యాలగూడ మున్సిపాలిటీలో 2020లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 48 వార్డులుగా చేశారు గతంలో 36 వార్డులు ఉంటే పెరిగిన జనాభాకు అనుగుణంగా 2020లో 12 వార్డులను పెంచుతూ 48 వార్డులుగా మార్చారు. ఆ సమయంలో జరిగిన ఎన్నికల్లో 27 వార్డులు బీఆర్‌ఎస్, 18 వార్డులు కాంగ్రెస్, ఒకటి సీపీఎం, ఒకటి బీజేపీ, మరొకటి ఇండిపెండెంట్‌లు గెలుపొందారు. అధిక స్థానాలు గెలుపొందిన బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను దక్కించుకుంది. ఇప్పుడు 13నెలల్లో వీరి పదవి కాలం ముగియనుంది. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సీపీఎం కౌన్సిలర్, ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఒకరు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 20కి చేరింది. ఇందులో ఇండిపెండెంట్ ఒకరు చనిపోగా 20 మంది ఉన్నారు. ప్రస్తుతం చైర్మన్, వైస్ చైర్మన్ వ్యవహారశైలి వ్యక్తిగత పోకడల కారణంగా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లలో ఎక్కువ మంది అసంతృప్తులుగా ఉన్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు, స్వతంత్రులు ఒకరు కౌన్సిలర్లు చనిపోగా గతేడాదిన్నర కాలంగా ఆ వార్డుల్లో ఉప ఎన్నికలు జరగకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

కీలకంగా వ్యవహరిస్తున్న బీసీ నేత

బీఆర్‌ఎస్ పార్టీకి ఎమ్మెల్యేతో కలిపి 28 సభ్యులు ఉండగా ఇందులో ఇద్దరు అనారోగ్యంతో చనిపోగా ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే ఓడిపోవడంతో వీరి బలం 24కు చేరింది. ఇందులో ఎక్కువ మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. 48 వార్డుల్లో నలుగురు చనిపోగా మిగిలిన 44 మందిలో 2/3 మంది ఉంటే అవిశ్వాసం నెక్కుతుంది. ఇప్పుడు ప్రస్తుతం కాంగ్రెస్‌కు 18మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీతో కలిపి 20మంది అయ్యారు. ఇంకా ముగ్గురు, లేదా నలుగురు మద్దతు ఇస్తే సరిపోతుంది. ఇప్పుడు 6 నుంచి 8 మందికి పైగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అసంతృప్త బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నేత కీలకం వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ వారం పదిరోజుల్లో వారిని పార్టీలో చేర్పించుకోవడమా... లేకా అవిశ్వాసంలో వారి మద్దతు తీసుకోవడమా అనే విషయంపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. నేడే రేపో మున్సిపాలిటీ అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. అవిశ్వాస తీర్మానంతో మిర్యాలగూడ మున్సిపాలిటీ ముఖచిత్ర మారనుంది.



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

క్లుప్తంగా

సీఎం రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తదితరులు

నిడమనూరు : తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఇంటి వద్ద ఆదివారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, నిడమనూరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రాహుల్ రెడ్డితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండలంలోని గుంటిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు, జానారెడ్డి వియ్యంకుడు మేరెడ్డి కేశవరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణ వివేక్, అర్జున్ రెడ్డిలు ఉన్నారు.

13నుండి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఈనెల 13నుండి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు మద్దిమడుగు ప్రకాశ్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన డ్రా ను ఈనెల 12న తీయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకై సెల్ నెం.9573293012, 9603196466 సంప్రదించాల్సిందిగా తెలిపారు.

బీఎల్‌ఆర్‌కు ఎమ్మెల్యే వీరేశం పరామర్శ



బీఎల్‌ఆర్ తల్లి వెంకట్రావమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

మిర్యాలగూడ : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తల్లి వెంకట్రావమ్మ ఇటీవల మృతిచెందింది. ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మిర్యాలగూడలోని బీఎల్‌ఆర్‌ను తల్లి వెంకట్రావమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌ను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాల అమలు అభినందనీయం

చందంపేట : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆర్యోశ్రీ పథకాలను వర్తింపజేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ చందంపేట మండల అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి

హాలియా : అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామానికి చెందిన సురభి జానయ్య అల్లుడు నేలపట్ల కొండల్ ఇటీవల కొత్తపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యుడు వంగాల భాస్కర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం నిమ్స్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండల్‌కు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు. ఆయన వెంట తిరుమలగిరి(సాగర్) మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి. మాజీ కోఆపరేటివ్ నాగేండ్ల కృష్ణారెడ్డి, తేరా అఖిల్‌రెడ్డి, పోగుల నాగార్జున్‌రెడ్డి, సురభి సతీష్, అబ్బుల్ కరీం తదితరులు ఉన్నారు.

సోమప్ప దేవాలయానికి పాదయాత్ర



శివాలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మిర్యాలగూడ : పవిత్ర కార్తీకమాస త్రయోదశిని పురస్కరించుకోని ఆదివారం మిర్యాలగూడ పట్టణానికి చెందిన దత్తాత్రేయ భక్త బృందం సోమప్ప దేవాలయానికి పాదయాత్ర చేపట్టారు. పట్టణంలోని గణేష్‌మార్కెట్ వినాయక దేవాలయం నుంచి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామంలో కొలువైన ఉన్న సోమప్ప శివాలయం వరకు సుమారు 15కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అనంతరం పురాతన శివాలయంలో కొలువుదీరిన సోమప్పస్వామిని దర్శించుకున్నారు. కృష్ణానంద గురుస్వామి ఆశీస్సులతో ప్రతి ఏటా జరిపే పాదయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు రచ్చ బాలనర్సయ్య, సత్యనారాయణ, మధులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-1997లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను తలచుకోని సంతోషంగా గడిపారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, వెంకట్ రెడ్డి, రామ చంద్ర రావు, పజ్జూరి రమేష్, లక్ష్మీ ప్రసన్న, రజిత, కల్పన, కవిత, యశోద, నాగమణి దర్మయ్య, బచ్చు రంగయ్య, గోపగాని రాము, అన్వర్, రషీద్, కొండయ్య, అంబటి వెంకన్న, అంబటి సైదులు, గంగుల నాగయ్య, అంబటి చంద్ర శేఖర్, సురేందర్, రమేష్ కుమార్, నాతి రమేష్, బచ్చు గోపయ్య, శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్ద మునిగల్ ఎంపీటీసీ కోతి యుగేందర్‌రెడ్డి సతీమణి అనురాధ ఇటీవల మృతి చెందింది. ఆదివారం పెద్ద మునిగల్ గ్రామంలో కోతి యుగేందర్‌రెడ్డిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు లోకసాని కృష్ణ, ముక్కమల వెంకటయ్య, సిరాజ్‌ఖాన్, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులున్నారు.

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని కలిసిన యాదగిరిరెడ్డి

తిరుమలగిరి(సాగర్) : ఇటీవల జరిగిన సాధరణ ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన జైవీర్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదగిరిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జయవీర్‌రెడ్డికి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసి నేతాపురం గ్రామపంచాయతీలో అధిక మెజార్టీ వచ్చేలా పనిచేసిన యాదగిరిరెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : మహిళా ప్రయాణికులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. ఆదివారం దేవరకొండలో మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆయన స్థానిక మహిళా ప్రజాప్రతినిధులు ,అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఎలాంటి ఛార్జీ లేకుండా ఉచిత రవాణా వసతిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, దూదిపాళ్ల రేఖ, డీఎం రాజీవ్, నాయకులు జాల నర్సింహ్మారెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, కొంగ్ర మల్లీశ్వరిశ్రీశైలం, గాజుల మురళి, ఎండీ యూనూస్, ఏవీ రెడ్డి, సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేదలకు వరం

ఆరోగ్యశ్రీ పథకం నిరుపేదలకు వరం లాంటిదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఆరోగ్యశ్రీ వైద్యపరిమితిని రూ.5లక్షల నుండి రూ.10లక్షలకు పెంచిందని ఆయన తెలిపారు. ఆదివారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అనుమతులున్న అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ కింద వైద్య సాయాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్ ఆరోగ్యశ్రీ అమలుకు సంబంధించి పలు వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, రేఖ, జాల నర్సింహరెడ్డి, చందంపేట జెడ్పీటీసీ నేనావత్ బుజ్జి, నాయిని మాధవరెడ్డి, కొంగ్ర మల్లీశ్వరి శ్రీశైలం యాదవ్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, వడ్త్య దేవేందర్‌నాయక్, లెండాల మోహన్, ఏవిరెడ్డి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



ఆరోగ్య శ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, తదితరులు

రోడ్డు పక్కనే డంపింగ్!

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ మీదుగా జడ్చర్ల-కోదాడ 167వ జాతీయ రహదారిపై పరిసర ప్రాంతాల ప్రజలు చెత్తను పడవేస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై పందులు, కుక్కల సంచారం పెరిగింది. ఈ కారణంగా రాత్రి సమయాల్లో ప్రమాదానికి కారణమైన సందర్భాలు సైతం ఉన్నాయి. కాగా చెత్తను వేసేందుకు ప్రతి గ్రామపంచాయతీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగం అవుతుండగా చెత్తను మాత్రం ఇలా జాతీయ రహదారిపై పడవేస్తున్నారు. ఈ విషయమై వివరణ కోసం స్థానిక గ్రామపంచాయతీ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడం గమనార్హం.



జడ్చర్ల-కోదాడ 167వ జాతీయ రహదారిపై పడేసిన చెత్త

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ సభ్యులు రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంకం చంద్రమౌళి, యూసుఫ్‌షరీఫ్, వనం బుచ్చయ్య, ముశిని వీరయ్య ఉన్నారు.

నేడు సాగర్‌కు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి రాక

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కుందూరు జయవీర్‌రెడ్డి ఈనెల 9న అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా సాగర్ నియోజకవర్గానికి సోమవారం రానున్నారు. ఎమ్మెల్యేగా జైవీర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం నియోజవర్గానికి వస్తుండడంతో స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున తరలిరానున్నారని అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం హాలియా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి చేరుకుని సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలపాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

హాలియా : అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామానికి చెందిన సురభి జానయ్య అల్లుడు నేలపట్ల కొండల్ ఇటీవల కొత్తపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యుడు వంగాల భాస్కర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం నిమ్స్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండల్‌కు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు. ఆయన వెంట తిరుమలగిరి(సాగర్) మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి. మాజీ కోఆపరేటివ్ నాగేండ్ల కృష్ణారెడ్డి, తేరా అఖిల్‌రెడ్డి, పోగుల నాగార్జున్‌రెడ్డి, సురభి సతీష్, అబ్బుల్ కరీం తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడటౌన్ : ఐదు రోజుల క్రితం కురిసిన తుపాన్ కారణంగా 220 కేవీ నుంచి వస్తున్న 33కేవీ విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ అయింది. దీంతో ఆదివారం అధికారులు మరమ్మతులు చేపట్టడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో డీఈ ఐతగాని వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మిర్యాలగూడ టౌన్, మిర్యాలగూడ రూరల్ ఏడీఈలు కొడిరెక్క రవికుమార్, రవీందర్‌రెడ్డిల పర్యవేక్షణల్లో మిర్యాలగూడ మండలం టిక్యాతండా వద్ద గల 220 కేవీలో మరమ్మతులు చేపట్టారు. అన్ని ఫీడర్లల్లో సమస్య ఉన్నందున వాటి మరమ్మతులను విద్యుత్ సిబ్బందితో చేయించారు. అదే విధంగా తుపాన్ కారణంగా షార్ట్‌సర్క్యూట్ అయిన 33కేవీ లైన్లు క్రేన్ల ద్వారా మరమ్మతులు చేపట్టారు. దీంతో మిర్యాలగూడ మున్సిపాలిటీతో పాటు మిర్యాలగూడ, త్రిపురారం, అడవిదేవులపల్లి, దామరచర్ల, వేములపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. తిరిగి మరమ్మతులు అయినా తరువాత విద్యుత్‌ను సరఫరా చేశారు.